క్లుప్తంగా

బోడు మండలంగా ప్రకటించాలి



మంత్రి సీతక్కతో చంద్రశేఖర్

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని బోడుని నూతన మండలంగా ప్రకటించాలని టేకులపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిలివేరు చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు మంగపేట పర్యటనలో ఉన్న మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రానికి 20–25 కిలోమీటర్ల దూరంలో బోడుతో పాటు 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. 99 శాతం ఆదివాసీలు నివసించే ఈ పంచాయతీలు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. పరిపాలన సౌలభ్యం, దూరాభారం తగ్గించేందుకు, అభివృద్ధి కోసం బోడుని నూతన మండలంగా ప్రకటించాలని కోరారు.

పదోన్నతిపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం



రవీందర్ సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్‌కు ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఏజెంట్ బూర రవీందర్‌ను శుక్రవారం పీవీకే-5 ఇంక్‌లైన్ గని అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ.. సంస్థలో నిబద్ధత, నైపుణ్యం, సుదీర్ఘ అనుభవం గల రవీందర్ నాలుగు సంవత్సరాలుగా పీవీకే-5 గని ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తనవంతు సేవలందించారని చెప్పారు. ఆయన సేవలను గుర్తించిన కంపెనీ పదోన్నతి కల్పించి కార్పొరేట్ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు పరామర్శ

ఇల్లెందు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఖమ్మంలో వైద్యం పొంది పాల్వంచలోని తన స్వగృహానికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను మున్సిపల్ కార్మికులు పరామర్శించారు. శుక్రవారం యూనియన్ నాయకులు యాకుబ్ షావలీతో కలిసి వెళ్లిన కార్మికులు కమిషనర్‌ను కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహంతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఇల్లెందు: పట్టణంలోని 2వ వార్డు ఇల్లెందులపాడులో శ్రీరామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. భక్తులు ప్రత్యేక పూజలు చేసి విగ్రహాన్ని పట్టణంలో ఊరేగింపు నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. భక్తి భావంతో ఈ కార్యక్రమం నిర్వహించిన పెరక భారతమ్మను కటకం పద్మావతి, స్థానికులు అభినందించారు.

విద్యార్థిని మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని మారుమూల గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎలుకల మందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కొమరారం ఎస్ఐ నాగుల్‌మీరా కథనం ప్రకారం.. ఈ నెల 25న తల్లి మందలించిందన్న ఆవేదనతో విద్యార్థిని ఎలుకల మందు తాగింది. కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా.. శుక్రవారం మృతి చెందింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

గేదెలను ఢీకొట్టిన కారు

జూలూరుపాడు: జూలూరుపాడు – నోభానగర్ గ్రామాల మధ్య సీతారామ ప్రాజెక్టు కార్యాలయం సమీపంలో తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి కారు గేదెలను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు... కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తున్న కారు సీతారామ ప్రాజెక్టు కార్యాలయం సమీపంలోకి రాగానే గేదెలను ఢీకొట్టింది. రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

మక్క సాగుపై మక్కువ

- అందుబాటులోకి నీటివనరులు, యంత్రాలు
- కలిసొస్తున్న గిట్టుబాటు ధర
- గణనీయంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- పత్తి, మిర్చి సాగు విస్తీర్ణంపై ప్రభావం

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో చాలామంది రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. పెట్టుబడి, శ్రమ తక్కువగా ఉండటం, తక్కువ సమయంలో పంట చేతికి రావడం, బహిరంగ మార్కెట్‌లోనూ మక్కలకు మంచి ధర ఉండటం, వ్యాపారులు మద్దతు ధర కంటే అధికంగా చెల్లిస్తుండటం వంటి కారణాలతో మక్క సాగుపై మక్కువ చూపుతున్నారు. రైతుల ఆసక్తిని పరిశీలిస్తే ప్రస్తుత వానాకాలంలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్: వర్షాధారంగా సాగు చేస్తున్న రైతులు నీటి తడులు అంతగా అవసరం లేని మొక్కజొన్న పంట వైపే మొగ్గు చూపడం ఇల్లెందు మండలంలో అనాదిగా వస్తోంది. అడపాదడపా కురిసే వర్షాలు మొక్కజొన్న సాగుకు సరిపోతాయి. కానీ ప్రస్తుతం కలెక్టర్, ఐటీడీఏ పీఓ చలువతో మండలంలోని పోడు భూములలో సైతం శాతం బోర్లు వేశారు. దీంతో వర్షాలు సకాలంలో కురవకున్నా నీటితడులకు అంతగా ఇబ్బంది ఉండదు. ఇక దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తుకోవడం, ఎరువులు వేయడం, చీడపీడలు ఆశిస్తే పురుగు మందు పిచికారీ వంటి పనులన్నీ చేసేందుకు ప్రస్తుతం యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. మక్కల నూర్పిడికి కూడా యంత్రాలు వినియోగిస్తుండటంతో రైతులకు అంతగా శారీరక శ్రమ ఉండదు.

పెరుగుతున్న వినియోగం, ధర..

మొక్కజొన్నలను ఎక్కువగా పౌల్ట్రీలకు ఉపయోగిస్తుంటారు. ఇతర పశువులకు కూడా దాణాగా వినియోగిస్తారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలు మక్క గింజలతో పలురకాల ఆహార పదార్థాలను రుచికరంగా తయారు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఆయా ఆహార పదార్థాలకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అంతేకాకుండా ఇథనాల్ తయారీలో మొక్కజొన్నలను వినియోగించడం తదితర కారణాలతో మార్కెట్‌లో మక్కలకు డిమాండ్ పెరిగింది. ఇలా వినియోగం పెరగడంతో రెండేళ్లుగా బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు మద్దతు ధర కంటే అధికంగా వెచ్చించి మొక్కజొన్నలను కొనుగోలు చేస్తున్నారు.

పత్తిసాగుపై కూలీల ప్రభావం...

పత్తిసాగుకు నల్లరేగడి నేలలు అనుకూలంగా ఉంటాయి. కానీ ఇల్లెందు మండలంలో అధిక శాతం ఎర్రచెక్క నేలలు ఉన్నాయి. ఈ నేలలు పత్తి కంటే మక్కల సాగుకు అనుకూలంగా ఉంటాయి. పత్తి సాగుకు ప్రధానంగా ఎడ్లు, నాగళ్లు అవసరం. వీటి సహాయంతో పత్తిసాగులో రైతులు పాటు, కలుపు నివారణకు మొక్క దశలోనే సాళ్లలో దున్నడం వంటి పనులు చేస్తుంటారు. కానీ యంత్రాల సహాయంతో అంతర కృషి అంత సులువు కాదు. అంతేకాకుండా పత్తితీతకు కూలీల అవసరం అధికంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితిలో కూలీల కొరత అధికంగా ఉండటంతో ఏటా రైతులు మొక్కల మీదనే పత్తిని వదిలేయాల్సి వచ్చింది. పెట్టుబడి అంత ప్రభావం చూపకున్నా అనువైన నేలల్లో పత్తి ఎకరానికి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ ఇల్లెందు మండలంలో మాత్రం కేవలం 8 నుంచి 10 క్వింటాళ్లు మాత్రమే పండుతోంది. కానీ విక్రయ సమయంలో ధర పతనం కావడం రైతులను నష్టాలకు గురిచేస్తోంది. దీంతో మండలంలో ఈసారి పత్తిసాగును కొంతమేర తగ్గిస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు.

కన్నీరు పెట్టిస్తున్న మిర్చిసాగు..

రైతులు జూదంలా భావిస్తున్న మిర్చిసాగు రైతులకు గడిచిన రెండేళ్లుగా కన్నీరు పెట్టిస్తోంది. మిర్చిని ఆశించిన చీడపీడల నివారణకు పురుగు మందులు ఎంతగా పిచికారీ చేసినా ఫలితం దక్కలేదు. ఇక కాత సమయంలో కూలీల కొరత రైతులకు చుక్కలు చూపించదనే చెప్పాలి. ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి, వారికి వసతి కల్పించి పంటను సేకరించుకోవాల్సి రావడం రైతులకు ఇబ్బందిగా మారింది. గతేడాది మంచి దిగుబడి వచ్చినా మార్కెట్‌లో ధర లేకపోవడం రైతులకు నష్టాలనే మిగిల్చింది. గతేడాది మార్కెట్‌లో ధర పతనం కావడంతో కోల్డ్‌స్టోరేజీలో పెట్టిన సరుకుకు నేటికీ మంచి ధర రాకపోవడం మిర్చిసాగు రైతులను నిరాశ పరుస్తోంది.



అచ్చు తోలుతున్న రైతులు

మొక్కజొన్న సాగుపై ఆసక్తి...



అధిక లాభాలనిచ్చే ప్రత్యామ్నాయ ఉద్యాన పంటలైన ఆయిల్‌పాం, మునగ వంటి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. డీలర్లు సైతం ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నారు. కానీ బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ పెరగడం, మద్దతు ధరకు మించి కొనుగోళ్లు ఉండటంతో రైతులు మక్క సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

– సతీష్, ఏఓ, ఇల్లెందు

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఆదర్శ గ్రామ పంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ ఉద్యోగులు, ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది పుల్లయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొంటారని తెలిపారు. కనీస వేతనం లేక అతి తక్కువ వేతనాలతో సంవత్సరాల తరబడి పనిచేస్తున్నామన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను విస్మరించి కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా కుదించి కార్మికుల హక్కులను హరిస్తోందని ఆరోపించారు.

8 గంటల పనివిధానం స్థానంలో 12 గంటల పనివిధానం అమలుల్లోకి రానుందని, దీన్ని కార్మిక వర్గం వ్యతిరేకించాలని కోరారు. ఈ సమస్యల సాధనకు చేపట్టిన జూలై 9న చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, గ్రామపంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యావసరాల పంపిణీ..

చుంచుపల్లి: తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ విద్యానగర్ ఆధ్వర్యంలో శుక్రవారం రామాంజనేయ కాలనీ గ్రామపంచాయతీ 16 మంది పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు, చీరలు, టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ... శాస్త్రి విజ్ఞాపనతో వెంటనే స్పందించి అసోసియేషన్ ద్వారా సేవలను అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ఇక ముందు కూడా మరిన్ని చేపట్టాలని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ సురేష్‌కుమార్, ధర్మారావు, మైనేని నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, గురుమూర్తి, సత్యానందం, అబ్దుల్ రషీద్, నసీరుల్లా, మాజీ సర్పంచ్ సరితా జ్ఞానమూర్తి, ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శి రమేష్, కాలనీ వాసులు శేషకుమారి, వనజ పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్

నేడు డయల్ యువర్ డీఎం

చుంచుపల్లి: కొత్తగూడెం, ఇల్లెందు పట్టణ పరిసర ప్రాంతాల ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శనివారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సలహాలు, సూచనలు, ఫిర్యాదులకు 9959225959 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇల్లెందు: ఈ నెల 28న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) ఎం.దేవేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు జరగనున్న ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు. 9959225959 సెల్ నంబరును సంప్రదించి ఫిర్యాదులు చేయాలని పేర్కొన్నారు.

సోషల్ మీడియా ప్రచార కార్యదర్శిగా వినోద్ కుమార్



టేకులపల్లి: సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగింది. ఈ సభలో వివిధ విభాగాలకు సంబంధించి రాష్ట్ర కమిటీలను ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేన సోషల్ మీడియా ప్రచార కార్యదర్శిగా టేకులపల్లి మండలం మద్రాస్ తండాకు చెందిన గుగులోత్ వినోద్ కుమార్‌ను నియమించారు.

పోరాటాలే మహిళల హక్కులకు రక్షణ

ఇల్లెందు: మహిళలు అన్నిరంగాల్లో సమరశీల పోరాటాలు నిర్వహించటం ద్వారానే తమ హక్కులను రక్షించుకుంటారని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని విఠల్‌రావు భవన్‌లో మహిళా సంఘం మండల 3వ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సారయ్య, చంద్రకళ, రత్నకుమారి, ధనలక్ష్మి, పద్మ, శ్రీలక్ష్మి, అలుగు సరిత, బంధం లక్ష్మి, నాగలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి..



గౌతం పొట్రుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం డైరెక్టర్(పా) గౌతం పొట్రుకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్మికులకు ప్రతీనెల 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ అమలు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, కోలిండియా వేతనాలు, ఈఎస్ఐపీఎఫ్ సమస్యను పరిష్కరించాలని సింగరేణిలో అన్ని ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి అమలు చేయాలని కోరారు. మూడు సంవత్సరాల క్రితం ఈఎస్ఐకు అంగీకరించినప్పటికీ అందుకు అవసరమైన నిధులు ఈఎస్ఐకి జమ చేయకపోవటంతో కార్మికులు నష్టపోతున్నట్లు చెప్పారు. టన్నెల్ లోపల, మరియు ఎత్తైన ప్రదేశాల్లో పనిచేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు జీఓ కంటే అదనంగా 20శాతం వేతనాలు చెల్లించాలని సర్క్యులర్‌లో ఉన్నప్పటికీ సింగరేణి యాజమాన్యం అమలు చేయటం లేదన్నారు. పని ప్రదేశాల్లో ప్రమాదం జరిగి గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు రిఫరల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.మధు, యాకూబ్‌షావలీ, మల్లెల రామనాథం, కరుణాకర్, భూక్యా రమేష్, గుగులోత్ సక్రాం తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో ఎరువుల పంపిణీ తనిఖీ



సొసైటీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: రైతులు రసాయన ఎరువులు వాడరాదని, నానో ఎరువులు వాడి భూసారం కాపాడుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. శుక్రవారం ఇల్లెందులోని వ్యవసాయ మార్కెట్‌లో పీఏసీఎస్ ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న ఎరువులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులు మేలైన పంటలు పండించే అవకాశం ఉంటుందని తెలిపారు. రసాయన ఎరవులు అత్యధికంగా వాడటం వల్ల అనేక అనర్థాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య వెంట మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోతు రాంబాబు, సెక్రెటరీ నరేష్, సొసైటీ సీఈఓ హీరాలాల్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇల్లెందురూరల్: ఎల్లాపురం గ్రామంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన కుటుంబాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం పరామర్శించారు. ప్రమాద వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రవీణ్ భార్య మౌనిక, పిల్లలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శుక్రవారం మృతి చెందిన విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బానోత్ రాంబాబు, మండల రాము మహేష్, పులి సైదులు, పూనెం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వైద్యశాలలో స్పెషలిస్ట్ డాక్టర్లు, ఫార్మాసిస్టులు, ఆయాలు, స్వీపర్ల ఖాళీలను బర్తీ చేయాలని ఏబీకేఎంఎస్ (బీఎంఎస్) జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని బీఎంఎస్ భవన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో సమస్యలు తాండవం చేస్తున్నా గుర్తింపు, ప్రాతినిత్య సంఘాలు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ప్రధానంగా ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్లు లేక ల్యాబ్‌ను తెరవడం లేదన్నారు. సింగరేణి వ్యాప్తంగా 38 పోస్టులు ఖాళీగా ఉండటం, రిటైర్డ్ అయిన సిబ్బంది స్థానంలో భర్తీలు చేపట్టకపోవటం వల్ల మిగతా ఉద్యోగులపై పనిభారం పడుతోందన్నారు.

ఆయాలు, స్వీపర్లు లేక ఆస్పత్రిలో పారిశుద్ధ్యం లోపించిందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని లేదంటే దశల వారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, టీఎస్ పవన్‌కుమార్, రామ్‌సింగ్, మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, ఎం.శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు డీఆర్‌డీఓ విస్తృత పర్యటన

చుంచుపల్లి: అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవికుమార్ శుక్రవారం చుంచుపల్లి మండలం పెనగడప గ్రామంలో జరుగుతున్న మునగ మొక్కలు ప్లాంటేషన్, జామాయిలు మొక్కలు ప్లాంటేషన్, గేదెల షెడ్డు నిర్మాణం పనులతో పాటు, రాంపురం గ్రామంలో మునగ ప్లాంటేషన్, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిత నర్సరీలను ఉపాధి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వచ్చే వన మహోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది నాగరాజు, అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు హనుమంతు, లలిత, రైతులు ఉన్నారు.



మునగ మొక్కలు నాటుతున్న రవికుమార్

కార్మికులకు వైద్యశిబిరం



ఇల్లెందు: వైద్యశిబిరానికి హాజరైన కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కమిషనర్ సుజాత అన్నారు. వంద రోజుల ప్రణాళికలలో భాగంగా కొత్తగూడెం పరిధిలోని కార్మికులకు శుక్రవారం హెల్త్ చెకప్‌లు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కూడా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. మాట్లాడుతూ... కార్మికులు డ్రెయినేజీలలో సిల్ట్ తొలగించడం, చెత్తచెదారాన్ని తొలగించేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు వాడాలన్నారు. దీంతో పాటుగా ప్రతీ నెల హెల్త్ చెకప్‌లు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు, సిబ్బంది, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, శానిటరీ జవాన్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఇల్లెందు: మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం నిర్వహించారు. శుక్రవారం ఇల్లెందులోని సీహెచ్‌సీ భవన్‌లో మేనేజర్ అంకుషావలీ ఈ హెల్త్ క్యాంపును ప్రారంభించారు. రొంపేడు పీహెచ్‌సీ డాక్టర్ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో 180 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

జెన్‌కో నూతన డైరెక్టర్లకు శుభాకాంక్షలు

పాల్వంచ: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జెన్‌కో డైరెక్టర్లను జాతీయ మాల విద్యుత్ ఉప కులాల సంఘ జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కర్, జాతీయ అంబేద్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నే శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో కలిశారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో డైరెక్టర్లు ఎస్‌వీ.కుమార్‌రాజు, జి.వీరమహేందర్, పి.బాలరాజు, వై.రాజశేఖర్‌రెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, ప్రవీణ్‌కుమార్, వినయ్‌కుమార్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బాలరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు

సుజాతనగర్: నియోజకవర్గంలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల పరిధిలో పూర్తయిన 18 అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ మరో 14 పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సర్వారం, కోయగూడెం, బేతంపూడి, జామ్లాతండా, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, నర్సింహాసాగర్, సింగభూపాలెం పంచాయతీల పరిధిలో పరిధిలో రూ.1.30 కోట్లతో పూర్తయిన రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులను ప్రారంభించారు. వీటితో పాటు మరో రూ.1.87 కోట్ల అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరిస్తున్నామని, ఇప్పటికే 70 శాతం మేర గ్రామీణ ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక అవసరాలైన తాగునీరు, విద్యుత్, వైద్య సౌకర్యం వంటి వాటికి ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మూడు ప్రాంతాల్లో రూ.1.38 కోట్లతో నిర్మించనున్న సంపు, పంపు హౌస్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని, మరో రూ.30 లక్షలతో పైపులైన్ల నిర్మాణం, పునర్నిర్మాణం చేపడుతున్నట్ల చెప్పారు. ప్రతీ పంచాయతీకి పక్కా భవనాలు నిర్మిస్తున్నామని, ప్రభుత్వ విద్యా సంస్థలు, వైద్యశాలలను బలోపేతం చేసేందుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో నాగా సీతారాములు, మండె వీరహనుమంతరావు, ఎంపీడీఓ బి.భారతి, తహసీల్దార్ కృష్ణప్రసాద్, భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, బొడ్డు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



సుజాతనగర్: బేతంపూడిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పాల్వంచరూరల్: వానాకాలం సీజన్‌లో గ్రామీణ ప్రాంత పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను మెరుగుపరచాలని, వ్యాధులు వ్యాప్తి చెందక ముందే అధికారులు ముందస్తుగా వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని, దోమల నివారణ మందును పిచికారీ చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. మండల పరిధి కారెగట్టు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా రూ.45లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న 90 కెఎల్ సామర్థ్యం కలిగిన సంప్‌హౌజ్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కారెగట్టు గ్రామంలో శాశ్వత మంచినీటి సమస్యకు సంప్‌హౌజ్ నిర్మాణం ద్వారా పరిష్కారమతుందన్నారు. మండలంలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సమస్యకు పరిష్కారం చూపినట్లు తెలిపారు. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి ప్రజలు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాల బారిన పడకుండా హెల్త్‌క్యాంప్‌లు నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, మిషన్ భగీరథ డీఈ సత్యసాయి, రూరల్ ఎస్ఐ సురేశ్, రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, అడుసుమల్లి సాయిబాబా, యర్రంశెట్టి మధు, దుగ్గిరాల సుధాకర్, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, శనిగారపు శ్రీనివాస్, కొంగర అప్పారావు పాల్గొన్నారు.